# మినీ కథలు

## న్యాయము-చట్టము

వీరభద్రరావ్ పమ్మి



"న్యాయము-చట్టము అన్నవి తలొగ్గి ఆచరించేవారికే! వాటిని ధిక్కరించేవారిని అవేమీ చెయ్యలేవు."

గౌస్ మాటలు నాకు అర్థం కాలేదు....

"అంటే ఏమిటి నీ ఉద్దేశం?" అడిగాను.

"చట్టాల్ని ధిక్కరించేవారిని— అవేమీ చెయ్యలేవు. వాటికి అణుకువగా ఉండేవారిని మాత్రమే అవి పట్టి పీడిస్తాయి." గౌస్ వివరించడానికి ప్రయత్నించాడు.

శివాజీ అతని అభిప్రాయంతో ఏకీభవించ లేదు. వాళ్ళిద్దరూ వాగ్వివాదంలోకి దిగారు.

చర్చ మంచి రసపట్టులో పడింది.

నాతోపాటు మా మిత్ర బృందంలోని మరిద్దరు కూడా శ్రోతలుగా వుండిపోయారు.

శివాజీ సహజంగా ఆవేశపరుడు కాబట్టి ఉద్వేగంగా తనకి తెలుస్తున్న ఉదాహరణలతోసహా వాదించడం మొదలుపెట్టాడు.

చట్టం అన్నది కత్తిలాంటిదని— పైగా రెండువైపులా పదునున్న కత్తిలాంటిదని— దాన్ని అతిక్రమించినవాడు— దానికి తలొగ్గే మన స్తత్వం వున్నవాడో, దానిని ధిక్కరించేవాడో అది చూడదని— అతిక్రమించినవాణ్ని కోసి తీరుతుందని— శివాజీ వాదం....

మరికొంతసేపు చర్చ అయ్యాక— "చట్టం కత్తిలాంటిదని శివాజీ చెప్పిన వాదంతో నేనేకీభవిస్తున్నాను. దానికి రెండు వైపులా పదునున్నదన్న విషయం కూడా అంగీకరిస్తున్నాను—

కాని అది కత్తి— అంటే జడ పదార్థం....దానికి సహజంగా చలనం లేదు. దాన్ని కదిలించేందుకు అధికారులుంటారు. దాన్ని కదిలించి అవసరాన్ని బట్టి దాన్ని ఉపయోగించడానికి రాజ్యాంగం వారికి అధికారం ఇచ్చింది.

అతిక్రమించినవాడు శిక్ష తప్పించుకుంటున్నాడంటే ఆ తప్పు కత్తిది కాదు— దాన్ని సక్రమంగా ఉపయోగించలేని అధికారిది" అన్నాడు ఆచారి.

ఆచారి అభిప్రాయంతో నేనేకీభవించాను. కాని వాణ్ని ఆటపట్టించడం నాకు సరదా— అంచేత,

"నీ వాదన బాగానే వుంది.. కాని దాన్ని సమర్థించుకుంటూ ఏదైనా సంఘటన చెప్పగలవా?" అన్నా కవ్వింపు ధోరణిలో.

"ఓ యస్.... నిన్నరాత్రే జరిగింది. చాలా చిన్న విషయం కూడా.." అన్నాడు ఆచారి.

ఆచారి కథ వినడానికి అందరూ సిగరెట్లు అంటించారు.

* * *

"....నిన్న రాత్రి నేను, మూర్తి గౌస్ ఇంట్లో భోజనం చేసి ఇళ్ళకు తిరుగు ప్రయాణం అయ్యాం. పంజాగుట్ట బస్‌స్టాండులో కాసేపు నిలబడ్డాక బస్సు వచ్చింది. అప్పటికే తొమ్మిదిన్నర దాటింది. మేం బస్ ఎక్కాం. బస్ ఖాళీగా ఉంది. అట్టే జనం లేరు. రెండు రష్ లేదు.

మాట్లాడుతూ, మాట్లాడుతూ మూర్తి సిగరెట్ అంటించి రెండు దమ్ములు గట్టిగా లాగాడు. మరికొన్ని క్షణాల్లో కండక్టర్ మా సీటు దగ్గరికి వచ్చి "సార్.... అది చూడలేదా?" అన్నాడు. అతను చూపిస్తున్న వైపు చూశాం....

"పొగ త్రాగుట నేరం...."

"బస్ ఖాళీగానే ఉందిగా" అన్నాడు మూర్తి.

స్టేజీలు దాటేసరికి నాకు, మూర్తికి కూడా సీట్లు దొరికాయి-కూర్చున్నాం. మరి కాస్సేపటికి నా పక్క సీటు ఖాళీ అయ్యింది. మూర్తి వచ్చి నా పక్కనే కూర్చున్నాడు. మా ఇద్దరికీ కాస్త దూరంలో ఎదమ వరసలో ఒకతను కూర్చున్నాడు. అతను తాగి ఉన్నాడని అతని మొహం, జుట్టు, కళ్ళు, కూర్చున్న విధం, సిగరెట్ తాగే విధం అన్నీ చెప్తున్నాయి.

చదువుకుని ఉద్యోగం చేసుకునేవాడిలా ఉన్నా ప్రతి నిత్యం తాగేవాడిలా స్పష్టంగా అనిపిస్తున్నాడు.

ఓ సారి అతనికేసి చూసి మళ్ళీ మేం కబుర్లలో పడ్డాం.

అతను సీటులోంచి జారిపోతూ మళ్ళీ సర్దుకుని కూర్చుంటున్నాడు. మేం మధ్యలో అతనికేసి చూస్తూనే వున్నాం.

బస్ ఆగినప్పుడల్లా ఒకరిద్దరు ఎక్కడం, ఒకరిద్దరు దిగడం తప్ప అంతకుమించి

"ఖాళీగా ఉంటే రూల్సు మారిపోతాయా?" అన్నాడు కండక్టర్. మూర్తి ఇంకేమీ అనకుండా సిగరెట్ కిటికీలోంచి బైటికి విసిరేశాడు.

నేను తాగుబోతు ప్రయాణీకుడికేసి చూశాను. అతను మరో సిగరెట్ అంటించి గుప్పుమన్నాడు. నాకు వళ్ళు మండింది.

"ఏమయ్యా- మరి అతనూ సిగరెట్ కాలుస్తున్నాడుకదా! మరి అతన్నేమీ అనవేం?" అన్నాను కోపంగా.

కండక్టర్ చిరునవ్వు నవ్వి....

"వాడు తాగుబోతు— వాడికి చెప్పి ఉపయోగం లేదు." అన్నాడు.

* * *

"వెధవ- తన వాదాన్ని చక్కగా సమర్థించుకుంటాడు" అన్నాను ఆచారి భుజం మీద కొడుతూ—

ఆనాటి సమావేశం ముగించి అందరం లేచి నిలబడ్డాం.